కథానిక

# "పెన్ను ఫ్రెండు"

కొమ్మూరి ఉషారాణి

పెన్ను ఫ్రెండు అన్న ముక్క చూడగానే, ఆ ఏడ్చేదేదో తెలుగులో ఏడవక ఇంగ్లీషు ఎందుకని, నామీద మీకు కోపమొస్తుందేమో, కొంచెం ఓపికపట్టి చదువుతే మీకే తెలుస్తుంది.

పూర్వం మావూరు కాలేజీలో హనుమాయమ్మని ఒక అమ్మాయి చదువుకునేది. ఆమెకి తన జీవితములోకల్లా ఒకటే లోపముగా కనుపించేది, అది తన పేరు హనుమాయమ్మ కావటము. లోకములో అన్ని పేర్లుండగా మందబుద్ధులయిన తన తల్లిదండ్రులు ఆ పేరే తన కెందుకు పెట్టాలని ఆమె రోజూ చింతించేది. అయితే మటుకేం? ఆ పేరునే పెట్టుకోవాలని యే శాస్త్రిల్లో వ్రాసివుంది? కాలేజీలో చేరగానే సుందరి అని పేరు మార్చుకుంది.

ఆ సుందరి పేరుకు తగ్గట్టు ఆమె ముఖం వుంటుందని అనుమాన పడతారేమో? వద్దు, వద్దు. ఆ సుందరి నల్లగా, సన్నగా, పొడుగ్గా వుంటుంది. ఆ సన్నంలో కూడా నాజూకుతనం లేదు. ఎన్నాళ్లనుంచో మంచంమీదుండి లేచి, అప్పుడే పత్యము పుచ్చుకుంటున్న దానిలా వుంటుంది పొట్టిపైకి చోళీ, పలుచని చీరలు ఆమెని మరింత సన్నగా కనబడేటట్లు చేస్తాయి. అదేమి విచిత్రమో, నల్లగావుండే మనిషి యెప్పుడూ నలుపు, ఎరుపు మొదలైన ముదురు రంగు చీరలు కడుతుంది. ముఖాన రెండు డబ్బీల పౌడరు కొట్టుకుని, చెవులదాకా పొడుగ్గా గీసిన కాటుక, పెదములకి రంగూ, యెత్తు బూట్సులూ వేసుకుని ఆమె కాలేజీకి వస్తే వెక్కిరించని విద్యార్థి లేడు.

అన్ని హంగులూ చేసుకున్న మనిషి ఎందుకో ముఖాన బొట్టు పెట్టుకోదు. ఓసారి సుందరి స్నేహితురాలింటికి వెళితే, అక్కడ ఓ వెధవావిడ ఆమె వాలకం చూసి, "పాపం, చిన్నతనంలోనే మొగుడు పోయినట్టున్నాడు, ఎంత దురదృష్టవంతురాలు!" అనుకుని విస్తుపోయింది.

తను చాలా అందగత్తెననీ, కాలేజీ బ్యూటీననీ ఆమె ఎంత మురిసిపోయినా, కుర్రాళ్ళందరూ ఆమెని "భువన సుందరీ, వనసుందరీ, స్వప్న సుందరీ" అని పేర్లుపెట్టి యేడిపించేవారు. ఎవరితోనైనా సరే ఇంగ్లీషు మాట్లాడేదే కాని, తెలుగు మాటలు నోటినుండి ఊడిపడేవి కావు. అసలు తను తెలుగుదేశం నడిగడ్డనుండి వచ్చిన తెలుగు పిల్లనని ఎవ్వరికీ తెలియకూడదని తాపత్రయ పడేది. కాని ఎంతచేస్తే ఏం లాభం? "శుద్ధ తెలుగు" ముఖాన్ని అందరూ ఇట్టే కనిపెట్టేవారు.

ఇక రూపురేఖలు అలావుంచి మనిషి ప్రవర్తనలోకి దిగామో మనమింకా నిరాశ చెందుతాము. ఎప్పుడు చూచినా "ఆ పుల్లేశ్వర్ నా వంక చూశాడు, ఈ వెంకట్రావు నాకు ప్రేమలేఖలు వ్రాశాడు, ఆ జయకర్ నా వెంటబడ్డాడు" అన్న సంగతులే కాని ఇంకో గొడవ మాట్లాడేది కాదు. నిజానికి అంత చక్కని పిల్లలున్న ఆ కాలేజీలో ఈ అప్సరస వెంట పడడానికి ఏమన్నా వెర్రివెధవలా కాలేజీ కుర్రాళ్ళందరూ? కాలేజీకి ఆలస్యంగా ఎందుకు వచ్చావనడిగితే "ఏముంది, బయట వేణు కట్టేశాడు. ఇద్దరమూ సోమర్ సెట్ మాఘమ్ పుస్తకాలను గురించి మాట్లాడుకుంటూ, టైమెంతయిందో తెలిసిందికాదు" అని సమాధానమిచ్చేది. సందు దొరికితే చాలు మొగవాళ్ళందరూ తన వెంట పడుతున్నారనీ, వాళ్ళని వదిలించుకోవడం తన తరం కావటం లేదనీ, గొప్పలు చెప్పుకునేది. కాలేజీ ఉత్సవాలకి ఎందుకు రావడంలేదని అడుగుతే, విద్యార్థులందరూ తనకు ఫోటోలు తీస్తామని బతిమాలుతారనీ, అది వాళ్ళ నాన్న కయిష్టమనీ చెప్పేది జడ ముందరకి వేసుకుంటూ.

ఇవన్నీ మినహా సుందరికి ఒక సుగుణం వుండేది. అది చక్కగా వ్రాయగలశక్తి. వ్యాసాలు,

ఉత్తరాలు, కథలు అతి నైపుణ్యంతో వ్రాసేది. కాని ఆ విద్య సుందరిని చాలా చిక్కుల్లో పెట్టింది. ఎప్పుడూ ఎవరికో ఒకరికి ఉత్తరాలు వ్రాస్తూనే ఉండేది, ఆడవాళ్ళకని పొరబడుతారేమో, మొగవాళ్ళకే సుమండీ! తను మధుబాలను పోలివుందని, సినిమావాళ్ళందరూ తన చుట్టూ తిరుగుతున్నారని బడాయిలు కొట్టేది. "ఈవిడ హీరోయిను వేస్తే మనమింక సినిమాలు చూడటం విరమించుకోవచ్చు"నని నవ్వుకునే వాళ్ళందరూ.

ఇహ అసలు సంగతికి వద్దాము. సుందరి వాసు అనే అబ్బాయితో ఉత్తరాల ద్వారా స్నేహము చేసుకుంది. అదేదో సంఘమట, ఐదు రూపాయలు చందా కట్టి అందులో సభ్యులయి ఒకరి అభిరుచులు ఆశయాలు ఇంకొకరికి తెలియజేసి, తద్వారా విజ్ఞానాన్ని వికసింప చేసుకుంటారట, అందులో చేరింది సుందరి. అలా స్నేహమయినవాళ్ళనే పెన్ను ఫ్రెండ్సు అంటారు!

వాసు మద్రాసులో ఒక ప్రసిద్ధ కళాశాలలో ఎం. ఏ. చదువుతున్నాడు. అతనికి సాహిత్యమంటే చాలా ప్రీతి. అదేమి చిత్రమో సుందరికి ఏ రచయితలు ఇష్టమో వాసుకీ వాళ్ళంటేనే అభిమానము. రాజకీయ, సాంఘిక, సాహిత్య విషయాల గురించి ఇద్దరూ జోరుగా ఉత్తరాలు వ్రాసుకునే వాళ్ళు. చివరికి వాళ్ళిద్దరి ఆశయాలు, అభిరుచులూ ఒకటే అయాయి.

వాసు ఉత్తరాలు చాలా ఆకర్షణీయంగా ఉండేవి. షేక్స్పియరునీ, షెల్లీని కోట్ చేసి అతి చాకచక్యంతో ఉత్తరాలు వ్రాసేవాడు. ఆ ఉత్తరాల కంటే అతని దస్తూరీ సుందరిని ఎక్కువ ఆకర్షించింది. మద్రాసులోవున్న కళాశాలలన్నిటిలోనూ, ఆ కళాశాల పేరుపడ్డది. అందులో వాసు ఎం. ఏ. చదువుతున్నాడు. ఎందుకో సుందరి మనసులో వెర్రి మొర్రి ఆలోచనలు ప్రారంభమయాయి. ఉత్తరాల ద్వారా పరిచయమేగాని వాసు ముఖం తనెప్పుడూ చూసి ఎరగదు. మనిషి అందమయిన వాడో? కాదో? వెంటనే అతను మనిషి యెటువంటివాడో, ఎట్లా ఉంటాడో, తెలియజేయమంటూ ఉత్తరం వ్రాసింది. తిరుగు టపాలో వాసు సన్నగా, పొడుగ్గా, తెల్లగా ఉంటాడనీ, అతను గ్రెగరీ పెక్‌ని పోలి ఉంటాడని అందరూ అంటారనీ, జవాబు వచ్చింది. ఇహ సుందరి సంతోషానికి అంతులేదు.

మర్నాడు కాలేజీలో అందరికీ తన పెన్ను ఫ్రెండు సంగతి చెప్పేసింది. ఉత్తరాల్లో వాళ్ళు ఏ విషయాలు వ్రాసుకుంటారనడుగుతే "అన్ని విషయాలూనూ" అనేది ముసిముసి నవ్వులతో. ఎట్లాగయినా వాసుని మా ఊరు రప్పించి, ఆతిథ్యమిచ్చి, తోటి మొగ, ఆడ స్నేహితులందరికీ తన మీద ఈర్ష్య కలిగేటట్లు చేయాలని నిశ్చయించుకుంది. డిశంబరు సెలవులకి వాసు ఈ ఊరు వచ్చి, సుందరితో ఒక రోజంతా గడిపి, తన అమూల్యమైన కాలాన్ని వెచ్చించటానికి ఒప్పుకున్నాడు. ఆ రోజు ఎప్పుడు వస్తుందా, వాసు దగ్గిర తనుసంభాషణ ఎలా ప్రారంభించాలా అని సుందరి రాత్రింబగళ్లు ఆలోచించింది. వాసుపొగడ్తలని ఎంతో ఓపికతో విన్న ఆమె స్నేహితులు కూడా, అతనిరాకకోసరమై సుందరి పడినంత ఆత్రుతా, ఆవేదనా అనుభవించారు.

అనుకున్న రోజు వచ్చింది. సాయంత్రం మూడింటికి యింటిముందు టాక్సీ ఆగింది. ఆత్రంతో సుందరి కిటికీలోంచి తొంగిచూసింది. ఆ కారులోంచి, నల్లగా, పొట్టిగా, లావుగా రబ్బరుబొంగరములాంటి ఒకాయన దిగాడు. ముఖం నిండా స్ఫోటకపు మచ్చలు. నూనె ఓడుతున్న హిట్లరు క్రాపు, మాసిపోయి నలిగిన గోధుమ రంగు జుబ్బా, పైకి యెగదీసి కట్టిన ఆ పంచా చూస్తే, అప్పుడే బర్రెపాలెంనుంచి వచ్చిన రైతులాగున్నాడు కాని కాలేజీవిద్యార్థిలాగ లేదు. కాళ్ళకు తెగిపోయిన చెప్పులు, చేతిలో ముక్కుతో నల్లబడిన రుమాలు చూచేటప్పటికి సుందరికి ఒళ్లు మండిపోయింది. కారాకిల్లీతో యెర్రబడిన గొగ్గిపళ్ళు బయటికి ప్రదర్శిస్తూ, చిరునవ్వు ముఖంతో ఇంట్లో అడుగుపెట్టాడు పెన్ను ఫ్రెండు.

"మీరేనా సుందరిగారు"రంటూ, ఆ శరీర భారాన్ని మోయలేక కాబోలు కుర్చీలో చతికిలబడ్డాడు. అసలు మనిషన్నవాడికి ఎన్ని వక్రాలు ఉండడానికి వీలుంటుందో, అన్ని వక్రాలూ ఉన్నాయతనిలో. ఎత్తుమూతి. వెడద

ల్లాంటి ముక్కు, ఆవగింజంత కళ్లు, అబ్బ! ఆ ముఖాన్ని ఒకసారి చూస్తే ఎటువంటి వాళ్ళకైనా సరే, మళ్ళీ అటుకేసి చూడటానికి మనసొప్పదు. గ్రెగరీ పెక్ లాంటి వ్యక్తిని ముఖాముఖీ చూడబోతున్నానని ఉవ్విళ్ళూరిన సుందరికి అతనిని చూడగానే తల తిరిగి పోయింది. ఆమె స్నేహితులందరూ, పైకి నిరాశ చెందినా, సుందరి పొగరు అణిగిందని లోపల సంతోషించారు. విధి అన్నట్లు, అందరూ వచ్చి కుర్చీలలో కూలబడ్డారు. సుందరికి వాళ్లెవరి ముఖం కేసి చూడడానికీ భయమేసింది. కను సంజ్ఞలతో అందరూ నవ్వడం ప్రారంభించారు.

వాసు మటుకు సుందరిని చూసి ఆశాభంగం కలిగినట్లు కనుపించలేదు. ఉన్న దానిలోనే సంతృప్తిపడే మనిషిలాగా ఉన్నాడు. సుందరిని కాకపోయినా, వీలయినంతవరకు ఆమె స్నేహితురాండ్రను పరీక్షగా చూస్తూ ఆనందం పొందాడు. మనిషి నోరు మూసుకుంటేనే నయం. మాట్లాడితే మరీ ఘోరంగా ఉన్నాడు. నవ్వినప్పుడల్లా బుజాలు ఏదో వెకిలిగా ఊగిస్తాడు. అతని మాటలు కూడా స్వచ్ఛమైన తెలుగులా లేవు. కొంచెం అరవం, తెలుగు కలిసి కర్ణకఠోరంగా ఉన్నాయి. పోనీ ఆ మాటలలోనైనా, ఏ కోశానా తెలివితేటలుగాని, చురుకుతనంగాని కనుపించవు. కూర్చున్నంతసేపూ సుందరనుకున్నట్లు షేక్స్‌పియరనీ, టెన్నిసన్ని గురించి మాట్లాడక, ఆడవాళ్ళ రవికల సంగతీ, చింతకాయ పచ్చడి సంగతీ అతి వెగటుగా అతను మాట్లాడుతుంటే, సుందరి సిగ్గుతో తల వంచుకుంది. అతని అజ్ఞానాన్ని ఎట్లాగయినా కప్పిపుచ్చి తన అవమానాన్ని కాపాడుకోవా లనుకుంది.

ఏ సినిమాకో వెళితే అలా బడబడా వాగటం మానివేస్తాడు, సినిమాలో అయితే మూడు గంటల కాలం గడిచిపోతుంది, పోనీ అక్కడయినా నోరు మూసుకుంటే బతికి బైట పడదామనుకుంది సుందరి. స్నేహితులున్నారనీ అభిమానం దెబ్బతింటుందనీ, పౌరుషం కొద్దీ వూరుకుండేది కాని, తనొక్కతే అయితే వాసు నెప్పుడో బయటకు గెంటేది. ఏ సినిమాకి వెళ్దామా అని అందరూ తర్జన భర్జనలు మొదలు పెట్టారు. "ఇన్నపల్లి లేదా! పోదాం మా! అందులో లలితా పద్మినీ నిండా బాగా ఆడినారంట" అన్నాడు వాసు. అందరూ గొల్లున నవ్వారు, ఎట్లాగయితేనేం సినిమాకి బయలుదేరారు. పాపం! సినిమా టిక్కెట్లు అందరికీ ఆ నిర్భాగ్యుడే కొన్నాడు. పైకి తను కొంటానని ఎంత పెట్టు చేసినా, ఆ డబ్బయినా తన చేతిలో మిగిలినందుకు సుందరి సంతోషించింది. పెన్ను ఫ్రెండు కనుక సుందరి అతని పక్కనే కూర్చోవలసి వచ్చింది.

ఆట ప్రారంభమవగానే సుందరి మనసు కుదుటపడింది. ఇంటర్‌వెల్ రాగానే అందరికీ డ్రింకులు తెప్పించింది. ప్రయాణం బడలిక వల్ల కాబోలు, ఒక కాలు తీసి, మడిచి కుర్చీలో పెట్టుకున్నాడు వాసు. రెండు చేతులతో డ్రింకు గ్లాసు గట్టిగా పట్టుకుని, పెద్ద చప్పుడు చేసుకుంటూ జుర్రటము మొదలెట్టాడు. ఆవేళ పొద్దున్నే సుందరి ఎవరి మొహం చూసిందో, సినిమాకి ఆమెకు పరిచయమున్న వాళ్లు చాలా మంది వచ్చారు. సినిమాకి వచ్చిన వాళ్లందరూ, ఆ వింత శబ్దము ఎటునుంచి వస్తోందా అని నవ్వాపుకుంటూ, తిరిగి చూడటం సుందరి సహించలేక పోయింది దీపాలు ఎప్పుడు ఆర్పుతారా అని ప్రాణము బిగబెట్టుకుని కూర్చుంది.

రాత్రి ఆ స్నేహితుణ్ణి వదలించుకుని, అతని దగ్గిర శలవు పుచ్చుకుని బయట పడేటప్పటికి పెద్ద గవర్నమెంటు పరీక్ష వ్రాసినంత పనయింది సుందరికి. మర్నాడు ప్రొద్దున్న మెయిలులో అతను తిరిగి మద్రాసు వెళ్ళిపోతాడన్న సంగతి విన్న సుందరికి గుండెమీంచి భారం తీసినట్టయింది.

ఆ అవమానాన్నించి కోలుకోడానికి ఓ నెల పట్టింది సుందరికి. తరువాత కాలేజీలో అందరూ ఆమెను "పెన్ను ఫ్రెండు" అని పిలిచేవారు హేళనగా. సుందరిలో ఉన్న చాలాకీతనం, గర్వం, ఎక్కడికి పోయాయో? ఎప్పుడూ మౌనంగా వుండేది. ఎవరన్నా పలుకరిస్తేగాని మాట్లాడదు. కఠినమైన శిక్ష కాకపోతేనేం, భరింపరాని అవమానమయితేనేం, ఆ అనుభవము, హనుమాయమ్మని మంచి మార్గంలోకి తిప్పిందనడములో సందేహము లేదు.